మని అనుకున్నాం కదా! వాళ్లు మనతో వస్తారంటావా?'' దీనంగా అడిగింది మార్గరెట్.

కచ్చితంగా వస్తారు. మనవణ్ని చూడాలన్న కోరిక వాళ్లకి మాత్రం ఉండదా? తాతయ్యకి ఏదో ఒకటి అరేంజ్ చేసిన తర్వాత వాళ్లని మనతో తీసుకుని వెళ్దాం'' అన్నాడు మాధవన్ ఆమెని సమాధాన పరుస్తూ.

''తాతయ్యా.. మార్గరెట్ మీతో ఏదో చెప్పాలనుకుంటోంది'' అంటూ రామనాథం దగ్గరగా వచ్చి కూర్చొన్నాడు మాధవన్.

''రామ్మా.. ఇలా వచ్చి కూర్చో!'' అంటూ, దగ్గరికి పిలిచాడు రామనాథం.

''తాతయ్య గారూ! ఇండియాకు వచ్చి మీ అందరితో మాట్లాడాలనే తెలుగు నేర్చుకున్నాను''.. మార్గరెట్ చిన్న పిల్లలా మాట్లాడుతుంటే ఆనందంగా వినసాగాడు.

''నా డెలివరీ టైంలో అత్తయ్య, మామయ్యా మా దగ్గర ఉండాలని అనుకుంటున్నాం. మీరు తప్పుగా తీసుకోవద్దు. మిమ్మల్ని మంచి వృద్ధాశ్రమంలో ఉంచుతాం. తిరిగి వాళ్లు ఇండియాకి వచ్చిన తర్వాత.. మీరు ఇంటికి వచ్చేద్దురుగానీ. ఇందులో మీకేమైనా అభ్యంతరముంటే చెప్పండి తాతయ్యగారు. మీరు మనస్ఫూర్తిగా ఒప్పుకొంటేనే అత్తయ్య, మామయ్యల్ని మాతో తీసుకుని వెళ్తాం''.. బతిమాలుతున్నట్లుగా అడిగింది మార్గరెట్.

గొంతు వణుకుతుంటే మాట్లాడటం మొదలుపెట్టాడు రామనాథం.

''పాపం నా కొడుకు.. ఈ రెండేళ్లలో నాకు సేవలు చేసి బాగా అలసిపోయాడు. ఎప్పుడూ ముఖం మాడ్చుకోవడం గానీ, విసుక్కోవడం గానీ నేను చూసింది లేదు.




వాడికి కొంచెం మార్పు కావాలి. తప్పకుండా వాళ్లిద్దర్నీ మీతోపాటు తీసుకుని వెళ్తామంటే.. నాకు అంతకన్నా కావాల్సిందేముంది? చాలా సంతోషం. నువ్వు మామీద ఇంత ప్రేమ చూపించడం.. నిజంగా చాలా ఆనందంగా ఉందమ్మాయ్. నేను అబ్బాయితో మాట్లాడతాను. వాళ్లిద్దర్నీ మీతోపాటు పంపే బాధ్యత నాది''.. నమ్మకంగా చెప్పడంతో మార్గరెట్‌కి కొంచెం ధైర్యం వచ్చింది.

* * *

బాల్కనీలో నిలబడి ఆకాశాన్నే తదేకంగా చూస్తున్న కొడుకూ, కోడలు దగ్గరికి వచ్చి నిలబడింది కామేశ్వరి.

''మార్గరెట్.. నువ్వు గోవా వెళ్లి అక్కడి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బాసిలికా చర్చిని చూడాలని చెప్పావుకదా! మరి ఎప్పుడు బయల్దేరుతున్నారు?'' అడిగింది.. కోడలి చేతులు పట్టుకుని.

''మేము రెండు నెలల లీవ్‌లో వచ్చాం అత్తయ్యా! మిమ్మల్నీ, మామయ్య గారినీ మాతో పాటు తీసుకుని వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలి కదా! తాతగార్ని మంచి వృద్ధాశ్రమంలో చేర్పించాలి. ఇవన్నీ చక్కగా అయిన తర్వాతే దేవుడి దర్శనం''.. జవాబు చెప్పిన కోడల్ని తదేకంగా చూస్తూ తన్మయత్వంలో ఉండిపోయింది కామేశ్వరి.

''మాధవన్‌ని అడిగితే వాడూ ఇలాగే అన్నాడు. కానీ, మీ మామయ్యగారు ఒప్పుకొంటారా? అన్నదే నాకు కొంచెం అనుమానంగా ఉందమ్మా. పుట్టబోయే మనవణ్ని చూడాలన్న కోరికైతే మనసులో బోలెడు ఉందికానీ.. ఆయన ఏమంటారో చూడాలి మరి''

''మీరేం భయపడకండి. మామయ్య తప్పకుండా వస్తారు. మీ మనవణ్ని ముందుగా మీరే ఎత్తుకుని ముద్దాడాలి. అదే నా ఆశ కూడానూ'' నెమ్మదిగా అంది మార్గరెట్.

రెండు రోజుల తర్వాత...

''మీరందరూ వారం రోజుల్నుంచీ చెవులు కొరుక్కుంటున్న విషయం నాకిప్పుడే తెలిసింది. నాన్న ఇప్పుడే నాకంతా చెప్పారు. కానీ, మీరు అనుకుంటున్నదానిలో చిన్న మార్పు. కచ్చితంగా మీ అమ్మ మీతో వస్తుంది. తనని మీతో తీసుకుని వెళ్లి, మీతోనే ఉంచుకుని మనవడి ఆలనా పాలనా చూసుకోమని చెప్పండి. మీకెప్పుడు తిరిగి పంపాలనిపిస్తే అప్పుడు పంపించండి. దయచేసి నన్ను మాత్రం బలవంతం చేయవద్దు. ప్లీజ్.. నాన్నగారిని ఈ స్థితిలో వదిలిపెట్టి రాలేను. ఆయన్ని వేరేవాళ్ల దగ్గర ఉంచడం నాకిష్టం లేదు. ఆయన ఆఖరి శ్వాస వరకూ నేను ఆయన పక్కనే ఉండాలని అనుకుంటున్నాను'' కొడుకును నెమ్మదిగా సమాధానపరిచాడు రామారావు.

రాత్రి పడుకునే ముందు..

''ఏమండీ! మీరు లేకుండా నేనుమాత్రం వెళ్లడం నాకిష్టం లేదండి'' అంది కామేశ్వరి.

భార్యని ప్రేమగా చూశాడు రామారావు.

''కామూ! నువ్వు తప్పకుండా వాళ్లతో వెళ్లాలి. డెలివరీ సమయంలో నువ్వు మార్గరెట్ పక్కన ఉండటం చాలా అవసరం. నా గురించి భయపడొద్దు. వంట చెయ్యడానికి పనమ్మాయి ఉంది. నాన్నగారిని చూడటానికి నేనున్నాను. నువ్వు మాత్రం ఎలాంటి కారణాలు చెప్పక బయల్దేరు'' అన్నాడు రామారావు.. భార్యకి ఆర్డరు వేస్తున్నట్లు.